వైఎస్ఆర్
కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 22 నవంబర్ 2025

## మంత్రి నారా లోకేష్‌తో జగన్ రాజు భేటీ

రాజంపేట, నవంబర్ 21 ప్రభాతవార్త



రాష్ట్ర విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబును రాజంపేట టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు శుక్రవారం కలిశారు. ఉండవల్లిలోని నారా లోకేష్ నివాసంలో కలిసి రాజంపేట నియోజకవర్గం లో పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజలకు తీసుకెళ్లాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు తెలియజేసినట్లు చమర్తి తెలిపారు. ఈ భేటీలో పలు విషయాలపై ఆయనతో చర్చించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, మేలును వివరించి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా కృషి చేయాలని సూచించినట్లు జగన్ మోహన్ రాజు తెలియజేశారు.

### ప్రమాదంలో మరణించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్

## కుటుంబానికి రూ.2.5లక్షలు ఆర్థిక సాయం

కడప క్రైం, నవంబరు 21, ప్రభాతవార్త:



ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి.నారాయణ (ఏఆర్ హెచ్‌సీ 3238) కుటుంబానికి జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ రూ.2.5లక్షలు ఆర్థిక సాయాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. పోలీసు సంక్షేమంలో భాగంగా పోలీసు వితరణ నిధి నుంచి ఈ మొత్తాన్ని అందజేశారు. దివంగత ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబ యోగక్షేమాలు విచారించారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ కేవీ రమణ, డీపీఓ బి.సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ నాయక్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు దూలం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తులు ముఖ్యం కాదు, వ్యవస్థ శాశ్వితం

కడప, నవంబర్ 21, ప్రభాతవార్త :



వ్యక్తులు ముఖ్యం కాదు, వ్యవస్థ మాత్రమే శాశ్వితమైనదని ప్రభుత్వ బాధ్యత ప్రతి అధికారిపై ఉందని ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ (పీఏసీ) చైర్మన్ కూన రవికుమార్ హితవు పలికారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాలులో ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ (పీఏసీ) చైర్మన్ కూన రవికుమార్ అధ్యక్షతన, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో సమీక్షా నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్మన్ తోపాటు ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, పామర్ల ఎమ్మెల్యే కుమార రాజా వర్ల, కాంట్రాక్టర్ ఇసాక్ భాష, జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, అసిస్టెంట్ సెక్రెటరీ నాగమునెయ్య హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రాధానంగా యోగి వేమన విశ్వ విద్యాలయం, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఐఐఐటి ఇడుపుల పాయ), రాయలసీమ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్, కడప స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్, పులివెందుల ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (పాడా), కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా), ఏపీ టూరిజం వైఎస్ఆర్ కడప రీజియన్, ఏపీ సెంటర్ ఫర్ అడ్వాన్స్ రీసెర్చ్ ఆన్ లైవ్ స్టాక్ లిమిటెడ్ (ఎపి కార్ల్) సంస్థల నిర్వహణ, అభివృద్ధి, పురోగతిపై చైర్మన్ కూనా రవికుమార్ క్షుణ్ణంగా సమీక్షించారు. ముందుగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లాలో అన్ని రంగాలకు పురోగమనంలోకి తీసుకురావడానికి జిల్లా యంత్రాంగం అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ ఆశయ సాధన దిశగా జిల్లాలో అభివృద్ధి అన్ని విధాలా సంతృప్తికరంగా సాగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో రాష్ట్రానికి జాతీయ స్థాయిలో మంచి ఆదరణ లభిస్తోందన్నారు. జిల్లాలో అన్ని రకాల సహజ వనరులు సమృద్ధిగా ఉన్నాయని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో, విద్యా వైజ్ఞానిక అంశాలు, నైపుణ్య అభివృద్ధిలో జిల్లా యువత ముందంజలో ఉందన్నారు. పీఏసీ చైర్మన్ కూన రవికుమార్ మాట్లాడుతూ జిల్లా విద్యా సాంకేతిక పారిశ్రామిక మౌలిక అభివృద్ధిలో పురోగమనం వైపు అడుగులేస్తుండడం సంతోషించదగ్గ విషయం అన్నారు. మరోవైపు ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనలో పురోగమనంలో జిల్లా ముందంజలో వున్నా.. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఇంకా సంతృప్త స్థాయిలో అన్ని అంశాల్లో జిల్లాలో అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాల అమలుతో రాష్ట్రానికి జాతీయ స్థాయిలో మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు విద్యా, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పారిశ్రామిక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రానికి ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ గుర్తింపును తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. అదే ఆశయంతో రాష్ట్రంలో జిల్లాకు కూడా ప్రత్యేక గుర్తింపు, ఆదరణ తీసుకురావాలన్నారు. ఆర్జీయూకేటి లో కేవలం 6 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ బి.టెక్ కోర్సులు మాత్రమే కాకుండా టెక్నాలజీకి సంబంధించి సర్టిఫికెట్ కోర్సులను కూడా నిర్వహిస్తే యూనివర్సిటీ ఆర్థికంగా పరిపుష్టి సాధించడంతో పాటు, చాలా మందికి సాంకేతిక నైపుణ్య సామర్థం. కూడా అందుతుందని సూచించారు. అలాగే విద్యార్థులు ఎక్కువ శాతం డిగ్రీ తర్వాత వెంటనే పీజీ కోర్సులను చేస్తున్నారని.. తద్వారా క్షేత్రస్థాయిలో అవగాహన లేకపోవడంతో పోస్టు గ్రాడ్యుయేషన్ స్థాయిలో సబ్జెక్టుపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోలేక పోతున్నారన్నారు. ఏ డిగ్రీ అయినా సరే.. అండర్ గ్రాడ్యుయేషన్ తర్వాత రెండు మూడు సంవత్సరాలు ఉద్యోగం చేసిన తర్వాతే పీజీ చేస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పాడా ఆధ్వర్యంలో ఎపి టూరిజం నిధులతో నిర్మించిన భవనాన్ని పరిశీలించి జిల్లా యంత్రాంగం ప్రభుత్వ హ్యాండోవర్ చేసుకోవాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఏపీ సెంటర్ ఫర్ అడ్వాన్స్ రీసెర్చ్ ఆన్ లైవ్ స్టాక్ లిమిటెడ్ (ఎపి కార్ల్) సంస్థలో అడ్వాన్సుడ్ రీసెర్చ్ ల్యాబ్ సదుపాయాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీసీఎండి అథారిటీ అందించిన ప్రమాణికాల మేరకు నిర్వహణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ రాజశేఖర్, డా. వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విసి ఆచార్య జీ. జయరామిరెడ్డి, ఆర్జీయూకేటి ఇంచార్జి విసి ఆచార్య విజయ్ కుమార్, ఎపి కార్ల్ సీఈవో శ్రీనివాస ప్రసాద్, టూరిజం ఆర్‌డిరమణ కుమార్, సిపిఓ హాజమతయ్య, కడప ఆర్డిఓ జాన్ ఎర్విన్, కమిషనర్ మనోజ్ రెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.

### జిల్లాలో ప్రాజెక్టుల

## పెండింగ్ పనులను పూర్తి చేయాలి



రాయచోటి, నవంబరు 21: ప్రభాతవార్త

జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని భారీ నీటిపారుదల, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. వెలిగల్లు ప్రాజెక్టు, పెద్ద మండెం మండలం, దిగుపల్లి గ్రామం వద్ద గల హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా ప్రధాన కాలువ మొదటి పంపింగ్ స్టేషన్, శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులను పరిశీలించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ వెలిగల్లు ప్రాజెక్టు ను సందర్శించి ప్రాజెక్టు విస్తీర్ణం, ప్రస్తుతం నీటిమట్టం నిల్వ, గేట్ల పరిస్థితి, ప్రాజెక్టు వద్ద కంట్రోల్ రూమ్ కుడి, ఎడమ కాలువల ద్వారా నీటి విడుదల ద్వారా ఎన్ని ఎకరాలు ఆయకట్టు కు నీరు అందుతున్నదని, తదితర విషయాలను భారీ నీటి పారుదల శాఖ, హెచ్ ఎన్ ఎస్ ఎస్ అధికారులకు అడిగి తెలుసు కున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు కర్ణాటకలోని నంది హిల్స్ పాపాగ్ని నుండి నీరు రావడం జరుగుతున్నదని దీనికి సంబంధించిన రూట్ మ్యాప్ ద్వారా ఏ ఏ ప్రాంతానికి నీరు అందించడం జరుగుతున్నదో ఇరిగేషన్, హెచ్ ఎన్ ఎస్ ఎస్ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు. వెలిగల్లు ప్రాజెక్టు నీటి సామర్థం 4.64 టీ యం సి కాగా , ప్రస్తుతం నీటి నిల్వ 4.15 టీఎంసీలు ఉన్నదని , కుడి కాలువ ద్వారా 60 చెరువులకు నీరు అందించడం 23,400 ఎకరాలకు నీరు అందివ్వడం జరుగుతున్నదని, అలాగే ఎడమ కాలవ ద్వారా 9 చెరువులకు నీరు అందించి 600 ఎకరాలకు సాగునీరు అందడం జరుగుతున్నదని అధికారులు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కుడి ఎడమ ప్రధాన కాలువలకు సంబంధించి పూర్తిస్థాయిలో పునరుద్ధరించడానికి అంచనాలను తయారు చేయాలని ఆదేశించారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా ఆయకట్టు దారులకు అందించేందుకు అవకాశాలను పరిశీలించాలని అధికారులకు తెలిపారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద పెద్దమండెం మండలం దిగువపల్లి గ్రామంలో శ్రీశైలం నుండి వచ్చే బ్యాక్ వాటర్ ను మొదట ప్రధాన పంపింగ్ స్టేషన్ 4900,/1.60 కి.మీ వద్ద పంపింగ్ స్టేషన్, పంపింగ్ ద్వారా అయినా వాటర్ డెలివరీ పాయింట్ పరిశీలించి అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. అనంతరం శ్రీనివాసపురం రిజర్వాయర్ సామర్థం 1.02 టీఎంసీ లు కాగా, 28 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు అందించడానికి వీలవుతుందని, 2 ప్రధాన కాలువల పనులు పూర్తయ్యాయని, ఈ ప్రాజెక్టు కింద భూమిని కోల్పోయిన రైతులకు పునరావాసం కల్పించడం జరిగిందని, కాలవల బ్రిడ్జిలు పనులు, లైనింగ్ పనులు తదితర చిన్న చిన్న పనులు పెండింగ్లో ఉన్నవని అధికారులు తెలిపారు. ఈ పనులకు సంబంధించి నివేదికలను తయారుచేసి ప్రభుత్వానికి పంపడం జరిగిందని ప్రభుత్వ అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లకు పిలిచి పనులను ప్రారంభించాలని ఆగస్టు 2026 లోపల అన్ని పూర్తి చేసే విధంగా చూడాలని, జిల్లాలో భూగర్భ జలాల పరిమాణ స్థాయి పెంపుదలకు ప్రత్యేక దృష్టి సాధించాలని వాటి అనుగుణంగా జిల్లాలో తాగు, సాగు నీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు పనిచేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఎస్ ఈ వెంకటరామయ్య, ఇరిగేషన్ ఈ ఈ భరత్ కుమార్ హెచ్ ఎంఎస్ఎస్ అధికారి సి. రాజగోపాల్, డిఈలు, ఏఈలు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## వేరుశనగ విత్తన శాంపిల్స్ కాయల గోల్ మాల్

### ఫ్రీ గా దళారుల పాలుఏవో పొంతన లేని సమాధానం



బి.కొత్తకోట నవంబర్ 21 ప్రభాతవార్త ః

ప్రభుత్వం రైతులకు ప్రయోగాత్మకంగా ఉచితంగా వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేసి తిరిగి వారి వద్ద నుండి మేలి రకం విత్తన కాయలు కొని ఖరీఫ్ సీజన్లో రైతులకు పంపిణీ చేయడం ఆనవాయితీ. అయితే బి. కొత్తకోట మండలంలో డెమోగా వచ్చిన వేరుశనగ విత్తన కాయలు పక్కదారి పట్టి రాజకీయ దళారులకు ఇష్టా రాజ్యంగా దారాదత్తం చేసిన సంఘటన వెలుగు చూసింది. బి.కొత్తకోట మండలానికి 734 సంచులు ప్రయోగాత్మక విశిష్ట రకం వేరుశెనగ విత్తన కాయలు హార్స్లీ హిల్స్ వద్ద గల ఎఫ్ఈఓ ఆఫీసుకు చేరాయి. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఈ విత్తన కాయలు రిజిస్ట్రేషన్ చేసుకున్న మేటి రైతులకు ఉచితంగా అందజేసి పంట పండిన అనంతరం పంట మేలిరకంగా ఉంటే ప్రభుత్వమే కొనుగోలు చేసి ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అందించాల్సి ఉంది. అయితే బి.కొత్తకోట మండలానికి చెందిన విశిష్ట విత్తన వేరుసెనగ కాయలు రాజకీయ నాయకులకు కేటాయింపులు చేసి ఇష్టారాజ్యంగా పంపిణీ జరుగుతున్నట్లు బట్టబయలైంది. శుక్రవారం ఎఫ్ఈఓ కార్యాలయంలో ఓ మహిళ అధికారి కొన్ని బస్తాలు పక్కన ఉంచి మరి కొన్ని బస్తాలు పంపిణీ చేయడం తోబాటు ఒకే రైతు 20 బస్తాలు తీసుకువెళ్లడం పై మతలబు ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు మండలంలోని ఓ గ్రామ వ్యవసాయ అధికారి మాట్లాడుతూ విశిష్ట విత్తన కాయలు బి. కొత్తకోట మండలానికి చెందిన ఓ అధికార పార్టీ నాయకురాలుకు 33 వేరుశనగ విత్తన కాయల బస్తాలు కేటాయించామని చెప్పడం హాస్యాస్పదం. ఈ విషయమై సంబంధిత మండల వ్యవసాయ అధికారిని వివరణ కోరగా ఆయన మండలానికి 734 బస్తాలు వచ్చాయని ఒకసారి కాదు కాదు 700 బస్తాలు వచ్చాయని మరోసారి చెప్పి నాలుకర్చుకున్నాడు. మొత్తం 700 బస్తాలు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తామని ఇందులో ఎలాంటి రాజకీయ నాయకుల ఒత్తిళ్లు లేవని చెప్పడం కొసమెరుపు. కొంతమంది రైతులు జిలా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. వేరుశనగ గోల్ మాల్ పై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే అని రైతులు వాపోతున్నారు.

## అంబేద్కర్ గురుకులంలో పిల్లలకు అశ్లీల పాఠాలు

### నిలదీసిన తల్లిదండ్రులు

కేవీ పల్లె నవంబర్ 21 ప్రభాతవార్త;



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డి సి ఓ దయశ్రీ

గురుకులంలో విద్యార్థినులకు చెప్పాల్సిన పాఠాలకు బదులు అశ్లీల, అసభ్యకర పాఠాలు ఓ ఉపాధ్యాయిని నేర్పుతోందని ఆరోపిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయురాలిని నిలదీసిన సంఘటన శుక్రవారం పీలేరు మండలం, చిత్తూరు మార్గంలోని అంబేద్కర్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలలో చోటు చేసుకుంది. అక్కడ చదువుతున్న విద్యార్థినులు, తల్లిదండ్రుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గణిత ఉపాధ్యాయిని ఈ విద్యా సంవత్సరంలో ఇక్కడ విధుల్లో చేరింది. ఈమె వ్యవహార శైలి తొలి నుంచీ వివాదాస్పదంగా మారింది. విద్యార్థినిలు పట్ల చులకన భావం ప్రదర్శిస్తూ, తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలకు బదులు అసభ్యకర అంశాలను పాఠాల రూపంలో చెపుతూ వస్తుందని, అశ్లీలతతో కూడిన అంశాలను విద్యార్థినిలకు వివరిస్తూ ప్రేరేపించేదని, పెళ్లికాని యువతులు ఎలా ఉండాలో చెబుతూ, వివాహమైన అనంతరం భర్తతో ఎలా మెలగాలో చెప్పుకొస్తుండేదని, ఇందతా చూస్తూ వచ్చిన విద్యార్థినులు ఈమె చేస్తున్నదంతా వారి తల్లిదండ్రులకు చెప్పి, విషయాన్ని పేపర్లో రాసి పాఠశాల ఆవరణంలోని ఫిర్యాదుల బాక్సులో వేయడంతో ఈ విషయం బయటకు వచ్చింది. నాలుగు రోజులుగా సెలవులో ఉన్న ఉపాధ్యాయిని శుక్రవారం విదులకు హాజరైంది. విషయం తెసుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు గురుకులానికి చెరుకుని, సంబంధిత ఉపాధ్యాయురాలును నిలదీశారు. ఈ టీచర్ మా పిల్లలకు వద్దంటూ నినదించారు. ఇదే విషయమై గురుకుల ప్రిన్సిపల్ బేబీ కరుణ మాట్లాడుతూ ఈ వ్యవహారంపై సంబందిత ఉపాధ్యాయురాలుకు సోకాజ్ నోటీసులు జారీ చేశామని, ఆమె నుండి వచ్చే సమాధానాన్ని ఉన్నతాధికారులకు పంపి తదుపరి చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు. ఈ విషయంపై ఫిర్యాదు అందుకున్న డిసిఓ ఉదయశ్రీ శుక్రవారం పొద్దు పోయాక గురుకుల పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. ఈ విషయమై సొసైటీ కార్యదర్శితో ఫోన్లో డిసిఓ మాట్లాడి పరిస్థితిని వివరించారు.

### ఇండియన్ మెడికల్ అసోసియేషన్

## రాష్ట్ర అధ్యక్షుడుగా డాక్టర్ బాలరాజు

### నేడు రాష్ట్ర స్థాయి సమావేశం

రాజంపేట, నవంబర్21ప్రభాతవార్త



ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా రాజంపేటకు చెందిన డాక్టర్ సంగరాజు బాలరాజు ఎంపికయ్యారు. నేడు,రేపు రాజంపేట తిరుమల కన్వెన్షన్ సెంటర్లో రాష్ట్రస్థాయి సమావేశం జరగనుంది. శనివారం ప్రస్తుత రాష్ట్ర కమిటీ సమావేశం అవుతుంది. సమావేశానికి ముఖ్య అతిథులుగాగా రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీధర్ రావు, ఐ ఎం ఎ రాష్ట్ర అధ్యక్షుడు సి.నందకిషోర్ వ్యవహరిస్తారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది వైద్యులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### క్యాన్సర్ నుంచి రక్షణకు

## ముందస్తు వైద్య పరీక్షలు చాలా ముఖ్యం

### ఐయంఏ పీలేరు శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజాసాహెబ్

కేవీ పల్లె,నవంబర్ 21 ప్రభాతవార్త:

ముందస్తు వైద్య పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షణ సాధ్యమే అని అందుకు సంపూర్ణ అవగాహన చాలా అవసరమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పీలేరు శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజాసాహెబ్ తెలిపారు. శుక్రవారం పీలేరు పట్టణంలోని అయ్యప్ప రెడ్డి కాలనీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పీలేరు శాఖ ఆధ్వర్యంలో "క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ తో సాధ్యం" అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో స్థానికంగా వివిధ విభాగాల వైద్య నిపుణులు పాల్గొని క్యాన్సర్ నివారణా చర్యలు తెలియజేశారు. విద్యార్థులకు క్యాన్సర్ రకాలు, వాటి తీవ్రత, లక్షణాలు, చికిత్స తదితర అంశాలపై వైద్యుల బృందం విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాధారణ స్థాయికి మించి శరీరముపై అసహజ కణాలను (కణితి) అనుమానించి, వ్యాధి నిర్ధారణ అనంతరం సత్వర చికిత్సల అవసరాన్ని గుర్తించాలని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. ఆరోగ్యకర జీవనశైలితో పాటు ప్రమాదకారకాల నుండి యువత దూరంగా ఉండాలని, క్యాన్సర్ కొందరికే వస్తుంది నాకు రాదనే అపోహ ఎవరికీ వద్దని, "హెచ్.పి.వి టీకా ఆవశ్యకతను ప్రతి యుక్తవయస్సు బాలిక గుర్తించాలని, శరీరంలోని అసాధారణ లక్షణాలు సంబంధిత వైద్యనిపుణుల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని, నిరక్ష్యంల్ల ఏమాత్రం క్షేమం కాదని వైద్యుల బృందం విద్యార్థులకు అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పీలేరు శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజా సాహెబ్, కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, డాక్టర్ మమత లక్ష్మి, డాక్టర్ శ్రీనివాస్ గుప్త, డాక్టర్ మానస, డాక్టర్ మధురిమ, డాక్టర్ హీనా, డాక్టర్ తాహిర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.




క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న ఐఎంఏ పీలేరు శాఖ బృందం

### నగరంలో గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలు సేవించే వారిపై

## డ్రోన్ కెమెరాలతో నిఘా

కడప క్రైం, నవంబరు 21, ప్రభాతవార్త:



గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై కఠిన చర్యలకు పోలీసు అధికారులు స్పెషల్ పార్టీ సిబ్బంది ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ మరియు డ్రోన్ కెమెరాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో వన్ టౌన్ సీఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో కడప నగరం వన్‌టౌన్ పీఎస్ పరిధిలో గంజాయి సేవనం, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో కడప సబ్ డివిజన్ స్పెషల్ పార్టీ సిబ్బంది దాడులు నిర్వహించారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో జల్లెడ పడుతున్నారు. గురువారం అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచడంతో పాటు గంజాయిని సేవించే వారిని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు. నగరంలోని బుగ్గవంక పరివాహక ప్రాంతం, గుర్రాలగడ్డ, పాత బస్టాండ్, నాగరాజుపేట, రాజా థియేటర్ పరిసరాల్లో పాత భవనాలు, ఇళ్లు ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానితులను గుర్తించే చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో నిరంతరం కడప నగరంలోని అనుమానిత ప్రాంతాలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో జల్లెడ పట్టడం జరుగుతుందని కడప డీఎస్పీ తెలిపారు.

## పరారీలో ఉన్న ఇరువురు బెట్టింగ్ నిర్వాహకులు అరెస్ట్

- రూ.10.56 లక్షలు నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం
- ముఠాతో సంబంధం ఉన్న అందరినీ గుర్తించి అరెస్టు చేస్తాం
- డీఎస్పీ శ్రీమతి పి.భావన

ప్రొద్దుటూరు క్రైం, నవంబరు 21, ప్రభాతవార్త:

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు ఇరువురు పరారీలో ఉన్న వారిని అరెస్టు చేయడం జరిగిందని డీఎస్పీ భావన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రొద్దుటూరు పట్టణంలో క్రికెట్ బెట్టింగ్ ముఠా కార్య కలాపాల గురించి తన ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో భాగంగా బెంగళూరు కేంద్రంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ ఆన్‌లైన్ ట్రేడింగ్ కోసం తమకు కరెంట్ అకౌంట్లు కావాలని తెలిపిన వారిని నమ్మించి వారి ద్వారా వివిధ బ్యాంకులలో అకౌంట్లు తెచరి వారి బ్యాంకు ఖాతా పుస్తకాలు తీసుకొని తద్వారా బెట్టింగ్ నిర్వహిస్తూ ఈ నెల 5న అరెస్టు అయిన ముఠాలోని 6 మంది సభ్యులు ఇచ్చిన నేర ఒప్పుదల ప్రకారం ముఠాలో కీలక సభ్యులైన ప్రొద్దుటూరు మండలం లింగాపురం గ్రామానికి చెందిన ధనికల వీర శంకరయ్య అలియాస్ వీర శంకర్ మరియు కాశినాయన మండలానికి చెందిన ప్రస్తుతం బెంగళూరులో ఉన్న ఆర్ల చంద్ర యాదవ్‌లపై నిఘా ఉంచి శుక్రవారం అరెస్టు చేసి వారి నుంచి రూ.10.56లక్షలు నగదు, 3 సెల్ ఫోన్లు, ఒక బ్యాగు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ ముఠా కార్య కలాపాలను గుర్తించి వారిని పట్టుకొని చట్టం ముందు నిలబెట్టుటలో ప్రతిభ కనబరిచిని టుటౌన్ సీఐ సదాశివయ్య, సిబ్బందిని అభినందించారు. వారికి రివార్డుల కోసం సిఫార్సు చేయడం జరిగిందన్నారు.





## గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచండి

చిన్నమండెం నవంబర్ 21 ప్రభాతవార్త:



మండల పరిధిలో అన్ని గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాలని యంపిడిఓ ఆదినారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయము సభా భవనములో థీమ్స్ 5 క్లీన్ అండ్ గ్రీన్ శిక్షణా కార్యక్రమానికి హాజరైన గ్రామ పంచాయతీల సి.ఆర్.పి.లు, గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గార్డ్స్ మరియు పంచాయతీ కార్యదర్శులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇందులో గ్రామ పంచాయతీలను పరిశుభ్రముగా వుంచుకోవాలసినదిగా అందరూ సిబ్బందికి తెలిపారు. అలాగే అందరు చిన్నమండేం గ్రామములో చెత్త సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీఓ శ్రీధర్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు ప్రధానం



తొండూరు నవంబర్ 21 ప్రభాతవార్త :

గ్రామంలోని 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు వేడుకను శాఖ గ్రంథాలయం తొండూరులో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా వ్యాసరచనలో పోటీలలో విజేతలైన వారికి జెడ్పిహైస్కూల్ ఉపాధ్యాయులు రమణ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంను గత వారం రోజులుగా రోజు ఒక్కొక్క ఒక్కోకార్యక్రమంతో నిర్వహించడం జరిగింది. గ్రంథాలయమును ప్రతిరోజు విద్యార్థులు చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు తమకు చదువుకొనుటకు కథల పుస్తకాలు న్యూస్ పేపర్లు అన్ని రకాలుగా అందుబాటులో ఉంటాయని గ్రంథాలయాధికారిని స్వరూపరాణి తెలియజేశారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



ఒంటిమిట్ట నవంబరు.22(ప్రభాత వార్త)

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వచ్ఛభారత్‌లో భాగంగా మండల కేంద్రమైన ఒంటిమిట్టలో శుక్రవారం ఎంపీడీవో సుజాత నేతృత్వంలో పంచాయితీ చెత్త సేకరణ కార్మికులు చిత్త సేకరించి పరిసరాలను శుభ్రం చేయడం జరిగింది. ఎంపీడీవో సుజాత మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉన్నట్లయితే వ్యాధులు రాకుండా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తకుండీలలో నిల్వ ఉంచుకొని పంచాయతీ చెత్త సేకరణ సిబ్బంది పంచాయతీ వాహనంలో వచ్చినప్పుడు ఆ చెత్తను వాహనంలో వేసి పరిశుభ్రతను కాపాడాలని ప్రజలకు సూచించడం జరిగింది. ఇందులో భాగంగా గ్రామంలో 8 ప్రాంతాలను గుర్తించి పంచాయతీ సెక్రటరీ సహాయంతో తమ సిబ్బందితో చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రపరచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఎంపీడీవో, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయాల మధ్యలో చర్చి నిర్మాణం పనులు ఆపాలి

లక్కిరెడ్డిపల్లి నవంబర్ 21, ప్రభాత వార్త



పురాతన ఆలయాల మధ్యలో చర్చి నిర్మాణ పనులు నిలిపివేయాలని హిందూ ధర్మ పరిరక్షణ సంస్థ ప్రతినిధులు అయ్యప్ప స్వామి గురు స్వామి వెంకటరమణ బిజెపి సీనియర్ నాయకుడు కృష్ణలు శుక్రవారం స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ రవీంద్ర బాబుకు తాసిల్దార్ క్రాంతికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆంజనేయ స్వామి ఆలయాల ఎదురుగా ఉన్న హిందూ స్మశానవాటికలు మధ్యలో చర్చీలు ఏర్పాటు చేయడం మంచిది కాదన్నారు ఈ ప్రాంతమంతా హిందువులు ఉన్నారని హిందువుల మధ్యలో చర్చి ఏర్పాటు చేయడం మంచిది కాదన్నారు. మతాల మధ్య చిచ్చు పెట్టకూడదని అధికారులకు నివేదికలు ఇస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు యనమల విశ్వనాథ్ సుబ్బరాయుడు బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్ ప్రసాదు సాయి, పురుషోత్తం పాల్గొన్నారు.

## సంపూర్ణ ఆరోగ్యవంతంగా తీరుస్తాం.




బద్వేలు, నవంబర్ 21, ప్రభాతవార్త

ఫీవర్ లేని సంపూర్ణ ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలని, సురేంద్రనగర్ యుపిఎస్సి వైద్య అధికారి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సురేంద్ర నగర్, తిరువెంగళపురం శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, లెప్రసీ, లార్వా, ఫీవర్ ,ఇంటింటి సర్వే చేస్తున్నామన్నారు. రాగి మచ్చలు స్పర్శ లేనట్లయితే కుష్టి వ్యాధిగా గుర్తించాలన్నారు. ప్రథమ దశలోనే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చన్నారు. సబ్ యూనిట్ అధికారి టి నరసింహా రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. ప్రతి స్కూల్ ను విజిట్ చేసి ,శుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. దోమతెరలను వాడటం వలన దోమలను పూర్తిగా అరికట్టవచ్చు అన్నారు. పాఠశాలలో వంట రూములను పరిశీలించి, వారికి శుభ్రత పై అవగాహన కల్పిస్తూ, విద్యార్థులను నాణ్యమైన భోజనాలను అందించేటట్లు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్దన్ రావు, సిహెచ్ఓ హర్షిత, ఏఎన్ఎం మహాలక్ష్మి, ఆశలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

మదనపల్లె, నవంబర్ 21 ప్రభాతవార్త :

జిల్లా బెస్త సంఘం ఆధ్యక్షులు మడితం రమణ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మత్స్యకారుల ఏడి సుస్మిత, ఎఫ్‌డిఓలు నరేంద్ర, సుబ్బనరసయ్యలు,జిల్లా అధ్యక్షులు ఎం.రమణలు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొసైటిల బలోపేతం చేయాలని, సొసైటీలో బెస్తలకు మాత్రమే సభ్యులుగా చేర్చుకోవాలన్నారు. జిల్లాలో మత్స్యశాఖ అధికారులు బెస్తలకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.




## అపరిశుభ్రతపై నోటీసులు ఇవ్వండి

సిద్ధవటం నవంబర్ 21 ప్రభాతవార్త



స్వర్ణాంధ్ర, స్వచ్ఛ్ ఆంధ్రలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం నుండి బస్టాండ్, పోలీసు లైన్ క్రాస్ వరకు స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి పరిసర ప్రాంతాలు శుభ్రంగా పెట్టుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించి తగు సూచనలు సలహాలు అందించారు. మఠంవీధిలో ఎంపీడీవో ఫణి రాజకుమారి స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో బాగా ఆమె పర్యటించి పలు గృహాల వద్ద అపరిశుభ్రత, ఉండడంపై ఆమె మండిపడ్డారు. పలు గృహాల నుండి మురుగునీరు రోడ్లపైకి వదలడంతో గృహ నివాసులకు ఆమె మందలించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా పెట్టుకునే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తెలిపారు. పారిశుద్ధ కార్మికులు ప్రతిరోజు తప్పనిసరిగా ప్రతి వార్డు చెత్త సేకరణ చేయాలని ఏదైనా సమస్యలు వస్తే నా దృష్టికి తీసుకురావాలని హరిత రాయబారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి మెహతాబ్ యాస్మిన్, ఆల్ డబ్ల్యూ ఎస్ ఏ ఈ గురు ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, ఏపిఎం, సుజాత, వివో ఏలు, డ్వాక్రా సంఘ సభ్యులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ భారతి, పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులు పాల్గొన్నారు

## మహిళా సంఘాలు జీవనోపాధి పెంపొందించుకోవాలి



తంబళ్లపల్లె నవంబర్ 21 ప్రభాతవార్త ః

మహిళ సంఘాలలోని సభ్యులు భవిష్యత్తులో జీవనోపాధి అవకాశాలు పెంపొందించుకోవడానికి కృషి చేయాలని జిల్లా డిఆర్డిఏ పిడి నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం ఐకెపిలో నియోజకవర్గ స్థాయి మహిళా సమైక్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధికి వ్యవసాయం, వ్యవసాయేతర ఆదాయ వనరులు ఎంచుకోవాలన్నారు. మహిళలు పరిశ్రమల వైపు దృష్టి సారించి ప్రాసెసింగ్ యూనిట్లు ద్వారా మార్కెటింగ్ తో భవిష్యత్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. మహిళా సభ్యులు బ్యాంకుల ద్వారా పాలు రకాల రుణాలను పొంది ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ఏపీడి లక్ష్మి ప్రసాద్ రెడ్డి, ఏపీఎంలు గంగాధర్, శ్రీలక్ష్మి, నాగార్జున, శ్రీనిధి మేనేజర్ అమరావతి, సిసిలు కత్తి నరసింహులు, రమణ, ఆదిలక్ష్మి, భాష, ఐకెపి అధ్యక్షురాలు రామలక్ష్మి మహిళ సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

## కూశెట్టి పాలకొండయ్య కు ఘన సన్మానం

మైదుకూరు, నవంబర్ 21, ప్రభాతవార్త:



ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కూశెట్టి పాలకొండయ్య కు మైదుకూరు మండల శాఖ ఆధ్వర్యంలో బద్వేల్‌రోడ్ లక్ష్మీచెన్నకేశవ కళ్యాణ మండపంలో సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు జి .కిరణ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి పద్మలత మాట్లాడుతూ విద్యా క్షేత్రంలో సమస్యల పై కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ 79 సంవత్సరాల చరిత్ర కల్గిన రాష్ట్రోపాధ్యాయ సంఘ కడప జిల్లా జనరల్ సెక్రటరీగా మొదటి సారిగా మైదుకూరు ప్రాతం నుండి ఎన్నికైన కూశెట్టి పాలకొండయ్య ఉద్యమాలే ఊపిరిగా పనిచేశారన్నారు. సన్మాన గ్రహీత పాలకొండయ్య మాట్లాడుతూ విద్యా, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా ముందుండి పోరాడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి గోశెట్టి రామమోహన్,ఉపాధ్యక్షుడు గంగారపు చంద్ర శేఖర్, జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వర రాజు, రీజియన్ కన్వీనర్ ఎస్.రమణయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్. సూర్య నారాయణ రెడ్డి జిల్లా సీనియర్ నాయకులు బి. కె సురేష్, మల్లేశ్వర రెడ్డి,మహిళా కన్వీనర్ శ్రీదేవి,మధు, రాధా, హజరత్‌రెడ్డి, నాగరాజు, నారాయణ, వరలక్ష్మి, అపర్ణ, విజయుడు, రవీంద్రా రెడ్డి మరియు అధిక సంఖ్యలో నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 20వ వార్డులో వైకాపాచే కోటి సంతకాల సేకరణ

మదనపల్లె, నవంబర్ 21 ప్రభాతవార్త :



సంతకాలు సేకరణ చేస్తున్న దృశ్యం

పట్టణంలోని 20వ వార్డులో వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్అహ్మద్ ఆధ్వర్యంలో శుక్రవారం కోటి సంతకాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల పిపిపి విదానానికి వ్యతిరేకంగా వార్డులో కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. పట్టణంలోని అప్పారావు వీధిలో ఉన్న గ్రంథాలయం ఎంతో ప్రజలకుఎంతో ఉపయోగపడేదని అలాంటిది మూసివేయడం భావ్యం కాదన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, సీనియర్ సిటిజన్లకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదన్నారు. మున్సిపల్‌అధికారులు వెంటనే గ్రంథాలయాన్ని పునఃప్రారంభించాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. అభివృద్దిని పూర్తిగా విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు అనూషారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజా,వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి, కౌన్సిలర్లు ప్రసాద్‌బాబు, ఈశ్వర్‌నాయక్, శారదారెడ్డి, నాయకులు ఇర్ఫాన్‌ఖాన్, మల్లిక, వినూతబాయి, ఆవుల విశ్వనాథ్, రహంతుల్లా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కదిరి నరసింహాస్వామిని దర్శించుకొన్న శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె, నవంబర్ 21 ప్రభాతవార్త :



కదిరి లక్ష్మీనరసింహా స్వామిని తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు దర్శించుకొని పూజలు చేశారు. శుక్రవారం ఆయన నియోజకవర్గంలోని టిడిపి నాయకులతో కలసి కదిరిలో ఉన్న నరసింహస్వామి ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ టిడిపి ప్రధాన కార్యదర్శి దొరస్వామినాయుడు, రాష్ట్ర తెలుగుయువత నాయకులు ఎస్.హనుమంతరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## 23న బలిజ సంఘంచే వనభోజనాలు

మదనపల్లె, నవంబర్ 21 ప్రభాతవార్త :

రూరల్ మండలంలోని సిటిఎం గ్రామం రేగడ వద్ద ఉన్న మల్లేశ్వర దేవాలయం నందు 23న ఆదివారం బలిజ సంఘంచే వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీసభ్యులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బలిజ సేవా సమితి అధ్యక్షులు బిపిఎల్ విజయకుమార్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. బలిజలు అందరూ వనభోజనకార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలన్నారు. ఈసి సభ్యుల రాజ్‌భవన్‌రాజ, శ్రీనివాసులు, పగడాల సూరి, సొక్కం వేణుగోపాల్, మదన్‌మోహన్‌లను ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో సిటిఎం గ్రామ బలిజ సేవా సంఘం నాయకుల పోగాకు వీరప్రతాప్, మురళీ మోహన్, ఒసూరి కిరణ్‌కుమార్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రిని కలిసిన వైసిపి కన్వీనర్

రామసముద్రం నవంబర్ 21 ప్రభాత వార్త



మాజీ మంత్రి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ కేశవరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకట రమణారెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం తిరుపతిలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి పలు విషయాలపైన చర్చించారు. మండలంలోని పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలను కలుపుకొని పోవాలని తెలియజేశారు. పార్టీ పట్ల ఏవైనా విభేదాలు, నిరుత్సాహం ఉంటే వాటిని పరిష్కారం చేయాలని కేశవరెడ్డికి తెలియజేశారు. ప్రతి గ్రామపంచాయతీలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పెద్దిరెడ్డి వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## ఆదరిస్తే అంతర్జాతీయ స్థాయికి...

సుండుపల్లె, నవంబర్ 21,ప్రభాతవార్త :

సుండుపల్లె మండల పంచాయతీ రాజ్ శాఖ జూనియర్ ఇంజనీర్ జై సూర్య నాయక్ ఉద్యోగంతో పాటు ఆటల్లో కూడా రాణిస్తూ తనదైన ముద్రను చాటుకుంటున్నారు. బ్యాడ్మింటన్ లో జాతీయస్థాయి క్రీడలకు మండల స్థాయి నుంచి జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎన్నికయ్యారు. తీవ్రమైన ఉద్యోగ ఒత్తిడిలో కూడా ఆట పట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటూ ప్రత్యేకమైన ఆట తీరుతో సర్వత్ర మన్ననలను అందుకుంటున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ బాడ్మింటన్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఛత్తీస్గఢ్ లేదా గోవా రాష్ట్రాలలో జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని సాప్ సభ్యులు తెలిపారు. ఐతే ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం కోసం నిబద్ధతతో పనిచేస్తున్న జయసూర్య నాయక్ బ్యాడ్మింటన్ ఆట పట్ల తనకున్న అమితమైన అభిమానంతో చక్కని మెలకువలను నిరంతరం తీర్చిదిద్దుకుంటూ జాతీయ స్థాయిలో బాడ్మింటన్ పోటీలలో పాల్గొనటానికి వెళుతున్న సందర్భంగా మండల ప్రముఖులు అతనికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జై సూర్య నాయక్ మాట్లాడుతూ తనకు మరింత ఆదరణ లభిస్తే అంతర్జాతీయ స్థాయిలో దేశం పేరు నిలబెట్టడానికి ప్రయత్నం చేస్తానని, దేశానికి బ్యాడ్మింటన్‌లో ప్రాతినిధ్యం వహించడం తన కల అని ఆయన తెలిపారు.

## స్వామిత్వ గ్రామసభ

రామసముద్రం, నవంబర్ 21 ప్రభాతవార్త



మాలేనత్తం గ్రామ పంచాయతీ సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ కొండూరు శ్రీనాథ్ రెడ్డి అధ్యక్షతన మండల డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గఫూర్ ఆధ్వర్యంలో స్వామిత్వ గ్రామసభ నిర్వహించడం జరిగింది. సర్పంచ్ కొండూరు శ్రీనాథ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం నేను ఎల్లప్పుడూ ఉంటానన్నారు, పంచాయతీ ఎదరయ్యే సమస్యలకు తక్షణమే స్పందిస్తానని, ప్రజావసరాల కోసం ఎప్పుడూ అందుబాటులో ఉంటాననీ హామీ ఇచ్చారు. డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ఇంటి యజమానులకు వారి ఇంటి ఖాళీ స్థలము మరియు ఇంటి నిర్మాణంతో కొలతలు 9(2) తీసి నోటీసులు పంపిణీ చేసి వాటిలో గల కొలతలు సరిచూసుకొని ఏవైనా అభ్యంతరములు ఉంటే గ్రామసభలో రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. గ్రామ ప్రజలకు అభ్యంతరములను స్వీకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గఫూర్ పంచాయతీ సెక్రటరీ ఇర్ఫాన్,శ్రీనాథ్ రెడ్డి, రూపేష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి,శివారెడ్డి, మహేష్ రెడ్డి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సెక్రటరీలు కార్మికులకు శిక్షణ కార్యక్రమం

రామసముద్రం నవంబర్ 21 ప్రభాతవార్త



మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్ అధ్యక్షతన థీమ్ 5లో రెండవ రోజు భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ మీద శిక్షణ కార్యక్రమంను పంచాయతీ కార్యదర్శులకు, కార్మికులకు ఏర్పాటు చేయడమైనది. ఈకార్యక్రమంలో క్లీన్ అండ్ గ్రీన్ పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అవగాహన కల్పించారు.ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబందించిన పంచాయతీ సెక్రటరీ లు,సచివాలయం సిబ్బంది కార్మికులు తదితరులు పాల్గొన్నారు. షెడ్ నందు సెగరిగెషన్ మరియు వర్మీ కంపోస్ట్ తయారీ గురించి అవగాహన గ్రీన్ అంబాసి దర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. గ్రీన్ అంబాసిడర్లతో వారి యొక్క సమస్యలపై ఎంపిడిఓ, డిప్యూటీ ఎంపిడిఓ చర్చించడం జరిగింది.

## నిమ్మనపల్లిలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం

నిమ్మనపల్లి నవంబర్ 21 ప్రభాత వార్త



మండలంలో రెడ్డివారిపల్లి గ్రామపంచాయతీ నందు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అందరూ పంచాయతీ కార్యదర్శులు గ్రీన్ అంబాసిడర్లు గ్రీన్ గార్డులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగినది. గ్రామంలో ప్రతి ఇంటి నుండి తడి మరియు పొడి చెత్తలను వేరు చేసే సేకరించడం జరిగినది. వీధులను శుభ్రం చేయడం జరిగినది. ప్రతి ఇంటికి వెళ్లి తడి మరియు పొడి చెత్త లను వేరు చేయు విధానంపై అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, డిప్యూటీ ఎంపీడీవో, అందరు పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది మండలం నందలి అందరు గ్రీన్ అంబాసిడర్లు గ్రీన్ గార్డులు పాల్గొనడం జరిగినది.

## దోమల పట్ల జాగ్రత్త వహించండి : జిల్లా వైద్యాధికారి

సిద్ధవటం నవంబర్ 21 ప్రభాతవార్త

దోమలు ఉత్పత్తి చెందకుండా నివారణ కొరకై పరిసర ప్రాంతాలు శుభ్రంగా పెట్టుకోవాలని కడప డిఎంహెచ్‌వో నాగరాజు తెలిపారు మండలంలోని మాధవరం 1 పార్వతీపురం గ్రామంలో శుక్రవారం, డ్రై డే, ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొని పలు సలహాలు సూచనలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పార్వతిపురం నందు డిఎంహెచ్ఓ నాగరాజు మాట్లాడుతూ రాత్రి వేళలో దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమ తెరలు తప్పకుండా వాడాలని, దోమ ఉత్తకుండా, మీ పరిసర ప్రాంతాల్లో నీరు నిలువ లేకుండా చూడాలని పరిసర ప్రాంతాలు శుభ్రంగా పెట్టుకుంటే సీజన్ వ్యాధులు దరిదాపుల్లోకి రావని సూచించారు. కుష్టి వ్యాధి సర్వేలో భాగంగా వ్యాధిగ్రస్తులను పరామర్శించి తగు జాగ్రత్తలు సూచించారు. కాళ్లు వంకర, ఉన్న పేషెంట్లు ఫిషియోథెరపీ చేపించుకోవాలని మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ నవంబర్ 17 నుండి గ్రామీణ ప్రాంతాలలో స్పర్శ లేని పొడలు ఉన్న పేషెంట్లను గుర్తించి జాగ్రత్తలు సలహాలు సూచించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ రవిబాబు, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ డీపీఎమ్ఓ రాఘవ, హెల్త్ సూపర్వైజర్ రమణయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు



## రైతాంగాన్ని ఆదుకోని టిడిపి ప్రభుత్వం




కడప కార్పొరేషన్ నవంబర్ 21 ప్రభాతవార్త:

ఏడాదికి రూ.20 వేలు రైతులకు ఇస్తున్నామని బాబు సర్కార్ గొప్పలు చెబుతున్నాదని, అందులో కేంద్రం రూ.6వేలు ఇస్తుందని వైసిపి వైద్య విభాగం జిల్లా అధ్యక్షులు నాగార్జున్‌రెడ్డి, వైసిపి యువజన విభాగం నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర అన్నారు. శుక్రవారం కడప వైకాపా కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ రాయలసీమను అభివృద్ధి చేశానని సీఎం చంద్రబాబు గొప్పలు చెప్పుకుంటున్నారు. పుట్టపర్తిలో స్పేస్ సిటీ, కొప్పర్తిలో డ్రోన్స్ తయారీ ఒంటి ఇండస్ట్రీస్ పెట్టానని చెప్తున్నారనీ.. రాయలసీములో ఉన్న ఇండస్ట్రీస్ ను తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో పాలేరు మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసి 150 సీట్లు అడిగితే 50 సీట్లు పర్మిషన్ ఇచ్చారని.. ఈ ఏడాది టిడిపి సర్కార్ పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైసిపి వాలంటరీ విభాగం జిల్లా జనరల్ సెక్రెటరీ ఫయాజ్, యూత్ జనరల్ సెక్రెటరీ సతీష్ రెడ్డి, రాయల్ రెడ్డి, నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

## పారిశుధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి



లక్కిరెడ్డిపల్లి; నవంబర్ 21, ప్రభాత వార్త

ప్రతి గ్రామాన్ని మెగా పారిశుద్ధ గ్రామంగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో రెడ్డయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 16 పంచాయతీల్లో అనంతపురం గ్రామాన్ని మెగా పరిశుధ్యం క్లియర్ అండ్ గ్రామంగా ఎంపిక చేశారు. ఈ గ్రామంలో చెత్తాచెదారం తడి పొడి చెత్తలను అంబాసిడర్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. గంగమ్మ జాతర ప్రాంతమంతా పారిశుద్ధ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం గ్రామంతో పాటు 16 పంచాయతీలు పారిశుధ్యం పనులు చేపట్టాలన్నారు. ప్రతి వారము ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని పంచాయతీ అధికారులు అంబాసిడర్లు ఆ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దీనికి ఆ గ్రామ పంచాయితీ సర్పంచ్ అంబాసిడర్లు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి ఉషారాణి పంచాయతీ సెక్రెటరీ సుదర్శన్ రెడ్డి వెంకటయ్య సిరి బాబు నరసింహుడు నాగమణి నాగేశ్వరి హిమాంబాషా భాస్కర్ రజనీష్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎస్పిడిసి రాష్ట్రస్థాయి నిరసన ధర్నా కార్యక్రమం

పెనగలూరు నవంబర్ 21 ప్రభాత వార్త



మండలంలో నవంబర్ 24న జిల్లా కేంద్రాలలో డిసెంబర్ 10వ తేదీన రాష్ట్ర ఎస్పిడిసి కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిరసన తెలుపుతున్నట్లు ఇతర ఉద్యోగులు ఎంఈఓలకు గిరి వరదయ్య నాగసుబ్బ రాయుడులకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. నిరసన కార్యక్రమాలు తెలిపే సందర్భంగా సామూహిక సెలవు పత్రం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ విజయకుమార్. కంప్యూటర్ ఆపరేటర్ రాజేశ్వరి. అకౌంటెంట్ శివరామరాజు, సిర్‌ఎంటీలు జి సుజాతమ్మ. ఎం శశికళ. పి నరసింహులు, పి బాదుషా, మెసెంజర్ జి సుబ్బరాయుడు అందరూ కలిసి మండల విద్యాశాఖ అధికారులు గిరివరదయ్య, నాగసుబ్బరాయుడు సామూహిక సెలవు పత్రం ఇచ్చారు.

## ప్రమాదవశాత్తు లారీ బోల్తా

ముద్దనూరు, నవంబర్ 21 ప్రభాతవార్త:

ముద్దనూరు జమ్మలమడుగు ప్రధాన జాతీయ రహదారిలో నీ ఘాట్ రోడ్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామానికి చెందిన లారీ దాల్మియా సిమెంట్ కు వెళుతుండగా ఎదురుగా జమ్మలమడుగు వైపు నుంచి ట్యాంకర్ లారీ అతివేగంగా రావడంతో తప్పించబోయి ప్రమాదవశాత్తు లారీ బోల్తా పడిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో లారీ చోదకునికి ఎటువంటి గాయాలు అవలేదని స్థానికులు తెలిపారు.

## గ్రామాలు పరిశుభ్రం పచ్చదనంగా ఉండాలి



మైదుకూరు, నవంబర్ 21, ప్రభాతవార్త:

సుస్థిర అభివృద్ధి లక్ష్యం,థీమ్5 పరిశుభ్రత మరియు పచ్చదనం కలిగిన గ్రామ పంచాయితి అనే అంశంపైన మండలంలోని గంజికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని 7 మజారా గ్రామాల నందు గ్రీన్ అంబాసిడర్, గ్రీన్ గార్డ్స్ అందరూ కూడా శ్రమదానం చేసి గ్రామాన్ని పరిశుభ్రం పచ్చదనం గ్రామంగా చేయుటకు తమవంతుగా పని చేయడం జరిగింది. గంజికుంట పంచాయితి ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌లో శుక్రవారం ఎంపీడీఓ కె. శ్రీధర్ నాయుడు ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సర్పంచ్ లెక్కల జయ భారత రెడ్డి, జ్యోతి ప్రజ్వలనతో శిక్షణా తరగతులను ప్రారంభించారు. సీనియర్ ఫ్యాకల్టీ, డిప్యూటీ ఎంపీడీవో ఫ్లోరెన్స్ ఫిబి, గంజికుంట గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి మురళీ మోహన్ మండలంలోని వివిధ గ్రామ పంచాయితి అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

## వైసిపి నుండి టిడిపిలోకి పలువురు చేరిక

పెనగలూరు నవంబర్ 21 ప్రభాతవార్త



మండలంలోని ఈటమాపురం పంచాయతీకి చెందిన నాయుడు వారి పల్లె, మూగవారిపల్లి గ్రామాల్లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఈ ప్రాంతాల్లోని సుమారు 100 కుటుంబాలు రైల్వే కోడూరు నియోజకవర్గం టీడీపీ పార్టీ ఇంచార్జ్ మరియు కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామ ప్రజలు ఈ చేరికలకు ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో సింగమాల రామిరెడ్డి (మాజీ సర్పంచ్, మూగవారిపల్లి), షేక్ మహబూబ్ మాషా, షేక్ రిజ్వాన్ షేక్ రెహ్మాన్, సయ్యద్ సబ్బీర్ హుస్సేన్, షేక్ బికారి (యూత్ లీడర్), సయ్యద్ ఆబిద్ అలీ, షేక్ ఆమీర్, షేక్ మస్తాన్, షేక్ షబ్బీర్ (చక్రంపేట్), షేక్ మహమ్మద్ అజీమ్, షేక్ నజీర్, షేక్ నూరుల్లా, షేక్ సదక్‌వలి, షేక్ రెడ్డి బాషా, షేక్ అలీ, షేక్ బాజీ, షేక్ మహమ్మద్, సానే జితేందర్ రెడ్డి, వడే నారాయణరెడ్డి, సిగమల సుధాకర్ రెడ్డి తదితరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు.

## ఇంటర్‌మీడియట్ విద్యార్థి ఆత్మహత్య

రామసముద్రం, నవంబర్ 21 ప్రభాతవార్త :

కుటుంబసభ్యులు మందలించారన్న నెపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఇంటర్ మీడియట్ విద్యార్థి అభిషేకుమార్(17) శుక్రవారం మృతి చెందాడు. ఈ విషాద సంఘటన మండలంలోని ఎలకపల్లె పంచాయితీ జక్కంవారిపల్లెలో చోటు చేసుకొంది. ఇంటర్ మీడియట్ విద్యార్థి అకస్మికంగా మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాదచాయలు అలుముకొన్నాయి. విద్యార్థి కళాశాలకు సరిగా వెళ్ళలేదని విద్యార్థి తల్లి గౌరమ్మ మందలించడంతో మనస్థాపంకు గురైన విద్యార్థి ఈనెల 13న ఆత్మహత్యాయయత్నానికి పాల్పడ్డాడు. మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. దీంతో జక్కంవారిపల్లెలో విషాదచాయలు అలుముకొన్నాయి.

